# పైవాడే చూసుకున్నాడు

రంగరాజుకి మంచిపేరుంది... అంతకు మించిన పలుకుబడీ వుంది... నెలనెలా లక్షల్లో రాబడికూడా ఉంది! రంగరాజుకి తాతముత్తాతలు వదిలివెళ్ళిన ఆస్తి తరగనంతగా ఉంది... ఉన్న ఊళ్లో రెండంతస్తుల మేడ ఉంది. ఆ మేడ కాపలాకి మీసాలున్న ఘూర్ఖా లేకపోయినా, రోజుకి అరకిలో మటనూ, అరలీటరు పాలూ తాగే అల్సేషియన్ కుక్క ఉంది... దానికి 'రాజా' అనే పేరుంది.

అప్పుడప్పుడు యజమానితోపాటు ఎక్కితిరిగేందుకు 'స్కార్పియో' కారుంది!

ఇన్నింటితో పాటు రంగరాజుకి అందమైన భార్య 'అన్నపూర్ణ' ఉంది. ఆకుపచ్చరంగు పట్టుచీరకట్టుకుని - నుదుటి మధ్య పావలా బిళ్ళంత కుంకుమ బొట్టు పెట్టుకుని, మెడలో తనకున్న నగలన్నీ వేసుకుని నట్టింట్లో తిరుగుతూంటే కాశీలో ఉండే అన్నపూర్ణమ్మని చూసినట్టే అనిపిస్తుంది!

కానీ, రంగరాజుకి మాత్రం హైదరాబాద్‌లో వుంటున్న 'అమృతం' అందంగా కనిపిస్తుంది. ఆ అందానికి 'దాసోహం' అంటూ హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఆమెకు ఓ అపార్టుమెంట్ కొనిచ్చాడు రంగరాజు... సొంత ఊళ్లో ఉన్న రెండంతస్థుల మేడకంటే రెండు 'బెడ్రూమ్'లున్న ఆ అపార్ట్‌మెంట్‌లోనే అతనికి హాయిగా ఉంటుంది. అందుకే, పనిలేకపోయినా - కల్పించుకుని నెలకు ఒక్కసారైనా హైదరాబాద్ వెడుతూంటాడు... వెళ్లినప్పుడల్లా పదిరోజులైనా అమృతం అపార్ట్‌మెంట్‌లో బస చేస్తూంటాడు, ఆ విషయాన్ని రంగరాజు పబ్లిగ్గానే చెప్పుకుంటాడు. అయితే, ఆ పదిరోజులూ అమృతం కౌగిట్లోనే ఉంటాడని ఊళ్లో ప్రజలు చెవులు కొరుక్కుంటారు. రంగరాజుని ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ విమర్శించే ధైర్యం ఆ ఊళ్లో ఎవరికీ లేదు. అసలు అలాంటి విమర్శలకు గురయ్యేలా ప్రవర్తించే మనస్తత్వం కాదు రంగరాజుది...! అన్నీ పకడ్బందీగా చేస్తాడు... చాలామందికి మాట సాయం చేస్తాడు... కొంత మందికి వడ్డీతీసుకుని 'అప్పు' సాయం చేస్తాడు... మరికొంతమందిని దగ్గర డబ్బుతీసుకుని - తన 'మాజీ ఎమ్మెల్యే పదవి'ని అడ్డంపెట్టుకుని హైదరాబాద్‌లో పనులు చేసిపెడతాడు...!

అన్నింటినీ మించి రంగరాజు - ఊళ్లో అన్ని రకాల ఉత్సవాలూ, పూజలూ చేస్తాడు. శ్రీరామనవమి వచ్చిందంటే చందాలు కూడా వసూలు చేస్తాడు. ఊళ్లో అమ్మవారి జాతర, గుళ్లో గోకులాష్టమి, బళ్లో స్వతంత్ర్యదినోత్సవం - వీటన్నింటి మధ్యా రంగరాజు కనిపిస్తాడు... తన సందేశం వినిపిస్తాడు!

గుళ్లో పూజారయ్యా, బళ్లో పంతులయ్యా, ఊళ్లో జనాలూ - ఒకరేమిటి అందరూ, రంగరాజు రోడ్డు మీద కనిపించగానే చేతులెత్తి దణ్ణమైనాపెట్టాలి... తలవంచుకుని తప్పుకోనైనా తప్పుకోవాలి!

'అయ్యా! తమరు నాకీ సాయం చెయ్యాలి!... తప్పదు!' - అంటూ రంగరాజుని ఎవరైనా ఆశ్రయిస్తే "నేను చేసేదేమిటోయ్? అన్నింటికీ ఆపైవాడున్నాడు... ఆయనే చూసుకుంటాడు!" అంటూ ముందుగా చిరునవ్వుతో ఆ వ్యక్తిని ఆశీర్వదిస్తాడు... ఆ తర్వాత, తను ఎలాంటి సహాయం చేయాలో తెలుసుకుంటాడు... దేనికీ 'కాద'ని చెప్పడు... 'ఔన'ని చెప్పటానికి మాత్రం ఎంత ఖర్చుఅవుతోందో చెప్తాడు! దానయ్యకి కూడా అలాగే చెప్పాడు...!

ఆ ఊరి మూడురోడ్ల కూడలిదగ్గర తాటాకుగొడుగు కింద కూర్చుని చెప్పులు కుడుతుంటాడు దానయ్య. తన 'వృత్తి వారసత్వం' తనకొడుక్కి రాకూడదనీ, వాడు బాగా చదువుకొని, తెల్లబట్టలు వేసుకుని, గవర్నమెంటాఫీసులో ఫ్యాను కింద కూర్చుని - నెలజీతం తెచ్చిపెట్టే ఉద్యోగం చేయాలనీ కొండంత ఆశపడ్డాడు. చెమటోడ్చి సంపాదిస్తూ కొడుకుని చదివించాడు... వాడు ఫస్టుక్లాసులో పదోతరగతి ప్యాసయ్యాడు... పక్కనున్న టౌనుకి పంపించి, అక్కడి హాస్టల్లో ఉంచి - పై చదువులు చదివించాలని దానయ్యకు కొండంత కోరిక ఉన్నా అది తీరేది కాదని అతనికి తెలుసు... అందుకే ఏదైనా ఉద్యోగంలో పెట్టాలనుకున్నాడు. సహాయం అర్థించటానికి ఓ రోజు సాయంత్రం రంగరాజు దగ్గరకు వచ్చాడు... మేడముందు 'లాన్'లో గులాబీ మొక్కల మధ్య - 'ఈజీ ఛైర్'లో కూర్చుని, కుడిచేత్తో సిగరెట్ కాలుస్తూ, ఒళ్లో కూర్చున్న అల్సేషియన్ కుక్కకి ఎడంచేత్తో బిస్కెట్లు తినిపిస్తున్నాడు రంగరాజు... అతని ముందు వినమ్రుడై నిలబడి చేతులు జోడించి నమస్కరించాడు దానయ్య.

"నా పేరు దానయ్యండి... మనూరి మూడురోడ్ల మొగదగ్గర చెప్పులు కుడుతూంటానండి!" పరిచయం చేసుకున్నాడు...

"ఓహో!... అలాగా!"

ఆర్నెల్ల క్రితం జరిగిన ఎన్నికల సమయంలో - తను 'ఎమ్మెల్యేగా' పోటీచేస్తూ - ఓటెయ్యమని అడగటానికి దానయ్య దగ్గరకు వెళ్లి ముందు అతనికి నమస్కారం పెట్టి - తర్వాత అతని చేతిలో యాభైనోటు పెట్టిన సంగతి గుర్తున్నా - అతన్ని అప్పుడే తొలిసారిగా చూస్తున్నట్టు ముఖంపెట్టి అన్నాడు రంగరాజు.

"వ్యాపారం బాగా సాగుతోందా!" సగం కాలిన సిగరెట్టును దూరంగా విసిరేసి అడిగాడు తర్వాత.

"మీ దయవల్ల పరవాలేదయ్యా!" చేతులు కట్టుకుని వినయంగా చెప్పాడు దానయ్య.

"నాదయ ఏముంటుందయ్యా! అందర్నీ దయతో చూసుకునేది ఆపైవాడే!" చెప్పాడు రంగరాజు.

"ఏమో బాబు!... నిజంగా దేవుడున్నాడో లేదో తెలీదుకానీ - తమరే మాకు దేవుడు లాంటోరు... అందుకే తమరి సాయంకోసం వచ్చాను!" - మళ్లీ చేతులు జోడించాడు దానయ్య.

"నాకు చేతనైన సాయం నేను ఎప్పుడూ చేస్తాను!.... ఆపైన ఇక - పైవాడే చూసుకోవాలి!... విషయం ఏమిటో చెప్పు!"

"నా కొడుకు - చిన్నా - మొన్ననే పదో తరగతి పాసయ్యాడయ్యా... ఇంకా పై చదువులు సదూకోవాలని ఆడికి కొండంత కోరిగ్గా ఉంది!... కానీ నాకు స్తోమత ఉండాలిగా!..."

"అంటే మీవాడి చదువుకి సాయం చేయమంటావా?" - వెంటనే అడిగాడు రంగరాజు.

"లేదయ్యా!... అయినా సదువుకి అంతెక్కడుంటుంది?.... హైదరాబాదులో చాలా కంపెనీలుంటాయంట? పదోక్లాసు పాసయిన వోళ్లక్కూడా పదివేలు జీతం వస్తాదంట - తమరే ఎలా అయినా ఏదో ఒక కంపెనీలో నా కొడుక్కి ఉద్యోగం వేయించి పున్నెం కట్టుకోవాల... నా చర్మం ఒలిసి తమరికి సెప్పులు కుట్టిస్తా?..." ఒంగి రంగరాజు కాళ్లకు నమస్కారం చేశాడు దానయ్య.

"అలాగే! రేపో, ఎల్లుండో నేను ఎలాగూ హైదరాబాద్ వెళ్లాల్సిన పనుంది చూస్తాన్లే!" అన్నాడు రంగరాజు.

"తమరు ఆ మాటంటే అంతే చాలునయ్యా!... ఇక నాకు చింతలేదు!" తన కొడుక్కి ఉద్యోగం వచ్చేసినంత సంబరంతో ఆయన దగ్గర శలవు తీసుకున్నాడు దానయ్య...

ఆ మర్నాడే రంగరాజు హైదరాబాద్ వెళ్లే రైలెక్కాడు. హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో రంగరాజు పరపతి పనిచేసింది.... దానికంటే ముందు దానయ్య ఇచ్చిన పాతికవేల మూట పనిచేసింది!... మొత్తానికి ఉద్యోగం వచ్చేసింది!...

కానీ, ఆ వచ్చిన ఉద్యోగం దానయ్య కొడుక్కి కాకుండా అమృతం కొడుకు ఆదినారాయణకు వచ్చింది!... అలా రావటానికి వెనకాల చాలా కథ నడిచింది!...

రంగరాజు హైదరాబాద్ వెళ్లిన తర్వాత - ప్రతి రెండు రోజులకూ, దానయ్య తన కొడుకును వెంటపెట్టుకుని, ఆయన ఇంటికి వస్తూనే ఉన్నాడు... 'అయ్యగారు వచ్చారా?' అని ఆత్రుతగా అక్కడి పనివాళ్ళను అడుగుతూనే ఉన్నాడు...

కానీ, హైదరాబాద్ వెళ్లిన రంగరాజు పదిహేను రోజుల తర్వాతగానీ ఇంటికి తిరిగి రాలేదు... తిరిగివచ్చిన రంగరాజు దగ్గరకు - దానయ్య పరుగెత్తుకుని వచ్చాడు...

"పని జరిగిందా బాబూ? నాకొడుక్కి ఏదైనా పనిదొరికిందా?" అని ఆశగా అడిగేడు.

"పని దొరకాలంటే పాతికవేలు కావాలని ఖచ్చితంగా చెప్తున్నారయ్యా!" చావుకబురు చల్లగా చెప్పాడు రంగరాజు... దానయ్య నిరుత్సాహపడ్డాడు... నీరు కారిపోయాడు... 'పాతికవేలా?' అనుకుంటూ నీళ్లు నమిలాడు...

"ఇపుడెలా అయ్యా?" - అంటూ గాఢంగా నిట్టూర్చాడు.

అప్పుడేం చేయాలో - రంగరాజే చెప్పాడు...

"జోళ్ల షాపుపెట్టుకోటానికి - నీకు 'బ్యాంకు'లో పాతికవేలు అప్పు ఇప్పిస్తాను. ఆ డబ్బు తీసుకుని నాచేతిలో పెట్టు!... నేను అవతలవాళ్ళ చేతిలో పెడతాను... నీ పని అయిపోతుంది... మీ వాడికి ఉద్యోగం రాగానే నెలసరి వాయిదాల్లో అప్పు తీర్చేయ్!"

తన కొడుక్కి ఎలాగైనా సరే ఉద్యోగం దొరికితే అంతే చాలనుకున్న దానయ్య రంగరాజు పరపతిపైన - పాతిక వేలూ అప్పుతెచ్చి ఇచ్చాడు...

'అమృతం కొడుక్కి ఉద్యోగం దొరికితే అంతే చాలనుకున్న రంగరాజు ఆనందంతో, ఆ పాతికవేలూ పట్టుకెళ్లి అవతలివాళ్ళకు లంచం ఇచ్చి మూడోనాటికల్లా ఆర్డరు తెచ్చి అమృతం చేతిలో పెట్టాడు...

అత్తకూతురైన అన్నపూర్ణ కాపురానికొచ్చి ఇరవై ఏళ్లు దాటినా - తనకింతవరకూ వారసుణ్ణి కనివ్వకపోయినా, అమృతం కొడుకు ఆదినారాయణనే తన కొడుకుగా చూసుకుని మురిసిపోవటం నేర్చుకున్నాడు రంగరాజు... వాడి నోట 'నాన్నా' అనే పిలుపు విన్నప్పుడు తలపుల్లో వెయ్యి వసంతాలు విరిసి మైమరచిపోతున్నాడు... కానీ -

ఆదినారాయణ చదువుల్లో వెనకపడ్డాడు... సరదాల్లో, ముందుకెడుతున్నాడు. ముందు వాణ్ణి ఓదారిలో పెడితేనే కానీ కుదరదని, రంగరాజు తన దగ్గరకు వచ్చినప్పుడల్లా అమృతం వార్నింగులు ఇస్తూనే ఉంది... సమయం కోసం రంగరాజు కూడా ఎదురు చూస్తూనే వున్నాడు... ఇప్పుడు సమయమూ సందర్భమూ కలిసి కట్టకట్టుకుని మరీ వచ్చాయి... దానయ్య బ్యాంకునించి తెచ్చిన నోట్లకట్టలు ఓ చిన్నసైజు సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇచ్చి - ఆదినారాయణకి ఆ ఉద్యోగాన్ని కొనిపెట్టాడు... చిన్నాకి రావల్సిన ఉద్యోగం ఆ విధంగా అమృతం కొడుక్కి దక్కింది...! సొమ్ము ఒకరిదైంది... షోకు మరొకరిదైంది!... అదీ, నడచిన కథ... దానయ్యకు మిగిలిన వ్యథ!!

తన కొడుక్కి ఉద్యోగం ఎందుకు రాలేదో - అర్థం కాకపోయినా - రంగరాజు - ఆ

విషయాన్ని చెప్పినప్పుడు దానయ్య మనసులోనే బావురుమన్నాడు... అప్పుడు రంగరాజు ధైర్యం చెప్పాడు - "చూడు దానయ్యా!... ఉన్న ఒకే ఒక ఉద్యోగానికి ఎంతో 'కాంపిటీషన్' వచ్చిందట!... ఇద్దరు ఎమ్మెల్యేలూ ముగ్గురు మినిష్టర్లూ - వాళ్ళ వాళ్ళ తాలూకు కుర్రాళ్ళను ఆ పోస్టులో వేయించాలని ఎవరికి వారే, హొరాహొరీగా ప్రయత్నాలు చేశారట!... నేను మాజీ ఎమ్మెల్యేని కదా!... అందుకే బెడిసికొట్టింది!"

అదీ రంగరాజు కల్పించి చెప్పిన కట్టుకథ! దానయ్యకి వినిపించిన దారుణమైన కథ. పాతిక వేలు పోసి దానయ్య కొనుక్కున్న విలువైన వ్యధ! అది తలుచుకుంటే అతనికి ఒళ్ళంతా ముళ్లు పొడుస్తున్నట్టుగా అనిపించింది.

"అధైర్యపడి ప్రయోజనం లేదు దానయ్యా!... రెండుమూడు నెలల్లో ఇలాంటిదే ఇంకోపోస్టు ఖాళీ అవుతుందట... ఎలాగా మన దగ్గర గడ్డి తిన్నారు కనుక - అది నీ కొడుక్కి ఖాయం చేస్తామని మాట ఇచ్చారు!"

అదీ రంగరాజు దానయ్యకి చెప్పిన ధైర్యం!... దానయ్య విరక్తిగా నవ్వుకున్నాడు -

"ఏమో బాబూ! ఇకనించీ నేను ఏ గడ్డితినాలో అర్థం కావటంలేదు!" తనలో తానే అనుకుంటున్నట్లుగా అన్నాడు.

"మరీ ఇంత దిగులుపడితే ఎలా?.... కష్టం వచ్చినప్పుడే ధైర్యంగా నిలబడగలగాలి!... రెండు 'టెర్ములు' ఎమ్మెల్యేగా చేసి మూడోసారి డిపాజిట్ కూడా రాకుండా ఓడిపోయాను... నేను ఎంత ధైర్యంగా వుంటున్నానో చూస్తున్నావ్‌గా?... అన్నింటికీ ఆపైవాడే వున్నాడు... నమ్ముకున్నవాళ్లకు న్యాయం చేస్తాడే తప్ప వాళ్లను నాశనం చెయ్యడు... మానవప్రయత్నానికి సాయం, ఆపైవాడి చల్లని చూపు కూడా కావాలి!" ఓదార్పుగా చెప్పాడు రంగరాజు.

"నిజమేనయ్యా! మనల్నందర్నీ చల్లగా చూసేది ఆపైవాడే కదా!" అని గొణుక్కుంటూ వెనుతిరిగాడు దానయ్య...

ఆపదలో ఉన్నప్పుడు చాలామందికి గుర్తుకొచ్చేది దేవుడే!.... అలాగే, ఆ ఆపద తీరింతర్వాత కూడా కొంతమందికి గుర్తుకొచ్చేదీ దేవుడే!...

కొడుక్కి ఉద్యోగం వచ్చిన సంబరంలో ఏడుకొండలవాడిని దర్శించుకోటానికి 'అమృతం' సమేతుడై తిరుమల కొండకు చేరుకున్నాడు రంగరాజు. కొడుక్కి ఉద్యోగం రాలేదన్న బెంగతో, మనశ్శాంతి కోసం దానయ్య కూడా కొండకువచ్చాడు. రంగరాజు వెయ్యి రూపాయలు ఖర్చుపెట్టి - దేవుడి కళ్యాణం చేయించాడు... పొద్దున్న 'ధర్మదర్శనం' క్యూలో నిలబడినా, స్వామి దర్శనం లభించని దానయ్యకి - పట్టు పీతాంబరాలు కట్టుకుని ఆలయం లోపలకు వెడుతున్న రంగరాజు కనిపించినప్పుడు 'ఈ క్యూ'లో నిలబడి, నా

కాళ్లు లాగేస్తున్నాయి.... నన్ను కూడా మీతో లోపలకు తీసుకెళ్ళండి బాబూ!.... పుణ్యం ఉంటుంది!" అని ఆయన్ని అడగాలని అనిపించింది... అయితే, అర్థంకాని అభిమానమో - ఇద్దరి మధ్యావున్న అసమానతో అడ్డుగా నిలిచింది... అయితే, దేవుడి కళ్యాణం కోసం 'రంగరాజు దర్జాగా ఖర్చుచేసిన వెయ్యి రూపాయలూ - తానిచ్చిన పాతికవేలలోవే' అనే నిజం దానయ్యకు తెలియదు!

అయినా జరగాల్సింది జరక్కమానదు - జరగరానిది ఏదైనా జరిగినప్పుడే ప్రతి మనిషికీ -పైవాడు వున్నాడనిపిస్తుంది!

ఏడు కొండలవాడిని దర్శించుకుని, అమృతని హైదరాబాద్‌లో దిగబెట్టి - పది రోజుల తర్వాత స్వగ్రామం చేరుకున్న రంగరాజు మొట్టమొదటిసారి మనస్ఫూర్తిగా అనుకున్నాడు- 'ఆ పైవాడు అంతా చూస్తున్నాడ'ని! అలాగే అష్టకష్టాలూ పడి నాలుగు రోజుల తర్వాత ఇంటికి చేరుకున్న దానయ్య కూడా' అన్నీ పైవాడే చూసుకుంటాడ'ని నమ్మకంగా అనుకున్నాడు...

ఇద్దరూ అలా అనుకోటానికి వెనకాల చాలా కథనడిచింది! ఒకరిది తియ్యని కల... వేరొకరిది చేదునిజం! అంతే!! ఆ రెండింటికీ వారధిలా నిలచింది ఓ ఉత్తరం! ఆ ఉత్తరాన్ని రాసింది అన్నపూర్ణ!...

"నేను మీ భార్యగా సుఖపడతానన్న గంపెడాశతో, నన్ను మీకిచ్చి పెళ్లి చేశారు మావాళ్లు... 'నా' శరీరానికి దొరికే సుఖంలో పదోవంతు సుఖమైనా నా మనసుకి దొరుకుతుందేమో' అనే ఆశతోనే ఆ ఇరవై ఏళ్లూ మీతో కాపురం చేశాను... ఆ సుఖాన్ని మీరు నాకు పంచి ఇవ్వకపోగా మరో ఆడదానితో మీరు సంబంధాన్ని పెంచుకున్నారు... అయినా భరించాను... రోజుల తరబడి ఆమెతో గడుపుతున్నా సహించాను... కానీ నేను భరించలేనిది ఒక్కటే! ఇకనాకు తల్లినయ్యే అవకాశం లేదనే ఆలోచన! - "..... ఈ మధ్య ఒకటి రెండు సార్లు మీకోసం, దానయ్య మనింటికి వచ్చినప్పుడు వెంట కొడుకుని తీసుకు రావటం చూశాను. నాకు కొడుకు లేడు... వాడికి తల్లి లేదు... మేడమీదనించి, వాడివైపు చూసినపుడు వాడికళ్ళల్లో ఆకర్షణ కనిపించింది... ఆ ఆకర్షణే నన్నెంతో ఆకట్టుకుంది... నా మాతృ హృదయం పురివిప్పింది... అంత లేతవయసులో వాడ్ని ఏదైనా పనిలో పెట్టాలని దానయ్య ఎందుకు తాపత్రయపడ్డాడో అర్థం చేసుకున్నాను...! రేపోమాపో తాను వృద్ధాప్యంలోకి చేరుకుంటే - తనకొడుకు రెక్కలు తెగిన పక్షిలా తల్లడిల్లిపోతాడని దానయ్య భయం... ఆ దురవస్థ తన కొడుక్కి రాకూడదని దానయ్య తాపత్రయం!

"... అందుకే నాకు నేనుగా దానయ్య దగ్గరకు వెళ్లాను! మీ భార్యగా కాదు. ఈ

లోకంలో పిల్లల ప్రేమకి నోచుకోని ఓ అభాగ్యురాలిగా వెళ్లాను. 'ఇకనించీ నీ 'చిన్నా' నా కొడుకవుతాడ'ని గర్వంగా చెప్పాను...' ఇంక చాలు అనేదాకా వాణ్ణి చదివించి 'వాడికి వాడేసాటి' అనిపించుకునేలా పెంచి పెద్దచేస్తానని దానయ్యకి మాటిచ్చాను... అతను, మాటరాక నిలబడిపోయి నాకు చేతులు జోడించి నమస్కరిస్తే - నా కళ్లు నాకు తెలియకుండానే చెమ్మగిల్లాయి..

"... అందుకే దానయ్య కొడుకు చిన్నా - ఇకనించీ నా కొడుకు! వాణ్ణి తీసుకుని నేను చాలాదూరం వెళ్లిపోతున్నాను... మీ నించి దొరకని మనశ్శాంతి వాణ్ని పెంచి పెద్దచేయటంలో దొరుకుతుందన్న నమ్మకం నాకుంది!... నా నమ్మకాన్ని ఆపైవాడు తప్పక తీరుస్తాడు!...

ఇట్లు
మీ దాన్ని కాలేని అన్నపూర్ణ..."

అదీ ఆ ఉత్తరం!

ఇంటికిరాగానే ఎదురుగా అన్నపూర్ణకు బదులుగా కనిపించిన ఆ ఉత్తరం చదివి రంగరాజు కృంగిపోయాడు... ఉన్నవాడు ఉన్నపళంగా హుటాహుటిని దానయ్య దగ్గరకు పరిగెత్తాడు!

"ఇంక నాకొడుక్కి ఉద్యోగం అఖ్ఖర్లేదు బాబూ! ఎవరో మహాతల్లి, ఆకలేసిన వాడికి అన్నంపెట్టే అన్నపూర్ణమ్మతల్లిలా నాముందు ప్రత్యక్షమైంది!... ఆపదలో పీకల్దాకా మునిగిపోయి ఉన్న నన్ను ఒడ్డున చేరుస్తానంది...! నా కొడుక్కి తను తల్లినవుతానంది బాబూ! నా కళ్ళముందునించి తీసుకెళ్లి పోయినా తన కళ్ళల్లో పెట్టుకుని పెంచుకుంటానంది... నేను బ్యాంకులో తీసుకున్న అప్పుతీర్చేసింది... జోళ్ళషాపు పెట్టుకోమని నాకు పాతికవేలుకూడా దానం చేసింది!... ఆ మహాతల్లిని ఆపైవాడే పంపించి ఉంటాడు బాబూ! మీరన్నట్టు ఆయన చాలా గొప్పోడు... అన్నీ ఆయనే చూసుకుంటాడు... ఎవరికి ఏం ఇవ్వాలో - ఎవరి దగ్గర్నించి ఏం తీసుకోవాలో ఆపైవాడికి తెలుసు!" - కళ్లల్లో ఆనంద భాష్పాలు నిండిపోతూంటే - దానయ్య హర్షాతిరేకంతో చెప్పాడు...

"నిజమే దానయ్యా! - ఆపైవాడు నిజంగానే అన్నీ చూస్తాడు... అందర్నీ చూస్తాడు!" అస్పష్టంగా గొణుక్కుంటూ, పిచ్చివాడిలా ముందుకు వెళ్లిపోయాడు రంగరాజు.

*కదలిక - మాసపత్రిక, జూలై 2011*

★ ★ ★